# అనన్య భక్తికి హనుమంతుడే ఆదర్శం

శ్రీరామ భక్తే హనుమంతుని శక్తి

భక్తులందరికీ ఆదర్శప్రాయుడు - హనుమంతుడు. నమ్మిన దైవాన్ని భక్తిగా కొలిచి, ఆ భక్తినే శక్తిగా మలుచుకున్న హనుమంతుడిలోని సుగుణాలే ఆయనను చిరంజీవిని చేశాయి. అసలు భక్తి అంటే ఏమిటీ అంటే, ఆత్మార్పణమే భక్తి. కృతయుగంలో తపోధ్యానాల ద్వారా, త్రేతాయుగంలో యాగక్రతువుల ద్వారా, ద్వాపరయుగంలో పూజలు, అర్చనల వల్ల సాధించదగినది. అలా వారు సాధించినది కలియుగంలో భక్తి ద్వారా సాధించవచ్చు. భక్తిలో మునిగిన వాడు సర్వత్రా తన ఇష్టదైవాన్నే చూడగలుగుతాడు. ఆ భక్తిలో మునిగిపోతాడు. అది ఒక దివ్య ప్రపంచం. ఇది హనుమంతునిలో ఎలా ఉంటుందో చెప్పడానికి ఎన్నో కథలు, ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

శ్రీరాముడు తను చూసే అన్ని జీవులలోనూ, వస్తువులలోనే కాదు, తనలోనే ఉన్నాడని ఒక సందర్భంలో తన హృదయాన్ని చీల్చి, చూపరులను సంభ్రమాశ్చర్యచకితులను చేస్తాడు. ఎందుకంటే అతని హృదయంలో ఉన్నది సీతా సమేత శ్రీరాముడే మరి. మరో సందర్భంలో హనుమంతుని సేవలకు మెచ్చి, సీతాదేవి శ్రీరాముని సభామండపంలో, ఒక ముత్యాల హారాన్ని బహుమతిగా ఇస్తుంది. వెంటనే



హనుమంతుడు ఆ హారాన్ని తెంపి, ఒక్కో ముత్యాన్ని పరీక్షగా చూస్తూ, ఆ ముత్యాన్ని అవతల పారేస్తూ ఉంటాడు. ఇతని చర్య సభికులకు ఆశ్చర్యాన్ని, సీతాదేవికి ఆగ్రహాన్ని కలిగించగా, వారి సందేహాలను ఇలా తీరుస్తాడు హనుమంతుడు. ఒక్క ముత్యంలోనూ నా దైవం నాకు కనపడలేదు. నా దైవం నా ఎదురుగానే ఉన్నప్పుడు మరి ఇటువంటి బహుమతులెందుకు? అని ప్రశ్నిస్తాడు.

అనన్యమైన భక్తికి ఈ ప్రశ్నే పరాకాష్ట. భక్తునికి భగవంతుని సాన్నిధ్యం కంటే మరి కావలసినది ఏమున్నది? దానినే ఇలా చెప్పాడు హనుమంతుడు. అంతేకాని ముత్యాలలోనూ భగవంతుని, తన దైవమైన శ్రీరాముని చూడలేక మాత్రం కాదు నిజమైన భక్తునికి ఇతరత్రా ఏ ఆలోచనలు రావు. దైవం మీద ఏకాగ్రత ఒక్కటే ఉంటుంది. భక్తిలో అనేక రకాలున్నాయి. భగవంతుని సేవించే పద్ధతుల ఆధారంగా భక్తిని తొమ్మిది విధాలుగా విభజించారు. తొమ్మిది విధాలైన ఈ భక్తిని నవవిధ భక్తి అని అంటారు. అవి

శ్రవణం : దైవాన్ని గురించి ఎల్లప్పుడూ వింటుండాలనే కుతూహలాన్ని కలిగి ఉండడం.

కీర్తనం: భగవంతుని గుణాలను కీర్తిస్తుండడం.

స్మరణం: భగవంతుని నిత్యం ధ్యానించడం, స్మరించడం. వందనం: భగవంతునికి నిత్య నమస్కారించి అర్చించడం. అర్చన: పూజించడం పాదసేవ: స్వామివారికి పాద సేవ చేయడం దాస్యం: రక రకాల సేవలతో భగవంతుని సంతృప్తి పరచేందుకు మార్గాలు వెతకడం సఖ్యం : దైవాన్ని మిత్రునిగా భావించి సేవించడం.ఆత్మ నివేదనం : స్వామిని మనసు నిండా నింపుకుని తనను తాను అర్పించుకోవడం.హనుమంతునిలో మనం ఈ నవవిధ భక్తినీ చూస్తాము.శ్రీరాముని మీద ఉన్న హనుమంతునికి ఉన్న భక్తి గురించి రామాయణంలో ఎన్నో గాథలున్నాయి. శ్రీరామ నామ బలంతో హనుమంతుడు ఎన్నో అసాధ్యమైన కార్యాలను సుసాధ్యం చేయగలిగాడు. భక్తునికి కావలసింది భగవంతుని మీద అచంచలమైన నమ్మకం అని చాటి చెప్పిన హనుమంతుడు భక్తులకే కాదు, నమ్మిన దానిని ఆచరించాలనుకునే ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడే

# హనుమదష్టకమ్

శ్రీ రఘురాజపదాబ్జనికేతన పంకజలోచన మంగళరాశే
చండమహాభుదండ సురారివిఖండనపండిత పాహి దయాళో
పాతకినం చ సముద్ధరమాం మహతాం హి సతామపి మాన ముదారం
త్వాం భజతో మమదేహి దయాఘన హే హనుమాన్ స్వపదాంబుజదాస్యమ్

సంసృతి తాపమహానలదగ్ధతనూరుహమర్మతనో రతివేలం
పుత్రధనస్వజనాత్మగృహాదిషు సక్తమతే రతికిల్బిషమూర్తేః
కేనచిద ప్యమలేన పురాకృతపుణ్యసుపుంజలవేన విభో వై
త్వాం భజతో మమదేహి దయాఘన హే హనుమాన్ స్వపదాంబుజ దాస్యమ్

సంసృతికూప మనల్ప మఘోరనిదాఘనిదాన మజస్ర మశేషం
ప్రాప్య సు దుఃఖ సహస్రభుజంగవిషైకసమాకుల దర్వతనో ర్మే
ఘోర మహాకృపణాపదమేవ గతస్య హరే పతితస్య భవాబ్ధౌ
త్వాం భజతో మమదేహి దయాఘన హే హనుమాన్ స్వపదాంబుజ దాస్యమ్

సంసృతిసింధువిశాల కరాల మహాబ్లకాల ఝుషగ్రసనార్తం
వ్యగ్రసమగ్రధియా కృపణం చ మహామదనక్ర సుచక్ర హృతాసుం
కాలమహారసనోర్మినిపీడిత ముద్ధర దీన మనన్యగతిం మాం
త్వాం భజతో మమదేహి దయాఘన హే హనుమాన్ స్వపదాంబుజ దాస్యమ్

సంసృతిఘోరమహాగహనే చరతో మణిరంజిత పుణ్యసుమూర్తే
మన్మథభీకరఘోరమహోగ్రమృగప్రవరార్దితగాత్రసుసంధేః
మత్సరతాపవిశేషనిపీడితబాహ్యమతేశ్చ కథంచి దమేయం
త్వాం భజతో మమదేహి దయాఘన హే హనుమాన్ స్వపదాంబుజ దాస్యమ్

సంసృతి వృక్ష మనేకశతాఘనిదాన మనన్తవికర్మసుశాఖం
దుఃఖఫలంకరణాదిపలాశ మనంగసుపుష్ప మచింత్యసుమూలం
తం హ్యధిరుహ్య హరే పతితం శరణాగతమేవ విమోచయ మూఢం
త్వాం భజతో మమదేహి దయాఘన హే హనుమాన్ స్వపదాంబుజ దాస్యమ్

సంసృతిపన్నగవక్త్రభయం కరదంష్ట్ర మహావిషదగ్ధ శరీరం
ప్రాణవినిర్గమభీతసమాకుల మంధమనాథ మతీవ విషణ్ణం
మోహమనోకుహరే పతితం దయయోద్ధర మా మజితేంద్రియకామం
త్వాం భజతో మమదేహి దయాఘన హే హనుమాన్ స్వపదాంబుజ దాస్యమ్

ఇంద్రియనామక చోరగణై ర్హ తతత్త్వవివేకమహాధనరాశిం
సంసృతిజాలనిపాతితమేవ మహాబలిభిశ్చ విఖండితకాయం
త్వత్పదపద్మమనుత్తమ మాశ్రిత మాశు కపీశ్వర పాహి కృపాళో
త్వాం భజతో మమదేహి దయాఘన హే హనుమాన్ స్వపదాంబుజ దాస్యమ్

బ్రహ్మ మరుద్గణరుద్ర మహేంద్రకిరీట సుకోటిలసత్పదపీఠం
దాశరథిం జపతి క్షితిమండల ఏష నిధాయ సదైవ హృదబ్జే
తస్యతహామామఏవ శివంకర మష్టపేత దనిష్టహరం వై
యః సతతం హి పఠేత్స నరో లభతే చ్యుతరామపదాబ్జనివాసమ

# కోరిన వరాలిచ్చే కోరుకొండ నృసింహుడు

తూర్పు గోదావరి జిల్లాలో రాజమండ్రికి సుమారు 20 కిలోమీటర్ల దురంలో 'కోరుకొండ' వుంది. ఈ క్షేత్రంలో స్వామివారు కొండపైన వున్న ఆలయంలోనూ, దిగువన వున్న ఆలయంలోనూ కొలువుదీరి పూజలందుకుంటూ వున్నాడు. శ్రీనరసింహస్వామి కొండపైన కొలువుదీరి భక్తులు కోరిన కోరికలను పూర్వకాలం నుండి తీరుస్తూ వుండేవడట. అందువల్ల భక్తులు కొండవద్ద కోరికలు కోరుతూ వుండేవారు. కోరికలు కోరే కొండ కనుక 'కోరుకొండ' అనే పేరు ఏర్పడినట్లు స్థలపురాణ కథనం! ఆ పేరే కొండ దిగువన ఏర్పడిన వూరికి



కూడా ఏర్పడింది. కోరుకొండలో శ్రీ లక్ష్మి నృసింహస్వామి కొలువు దీరడానికి సంబంధించి ఆసక్తికరమైన స్థలపురాణ గాథ ప్రచారంలో వుంది. పూర్వం ఈ కొండకు సువర్ణగిరి, వేద్రాద్రి, పారిజా తగిరి, పరాశర శైలము అనే పేర్లు వుండేవి. పూర్వం పరశరామ హర్షి, దేశపర్యటన చేస్తూ ఈ ప్రాంతాన్ని చేరుకుని ఈ ప్రాంత సౌందర్యాన్ని చూసి ముగ్ధుడై ఆశ్రమం నిర్మించుకుని తపస్సు చేసు కోవడం ప్రారంభించారు. ఈ విధంగా తపస్సు చేసుకు వుండిన పరాశర మహర్షి నరసింహస్వామి వారిని పూజిస్తూ వుండే వాడు. వారి భక్తికి మెచ్చి శ్రీ నరసింహస్వామి ప్రతి రోజూ దర్శనమిస్తూ వుండేవాడట. పరాశరమహర్షికి వృద్ధాప్యం వచ్చి తనువు చాలించే సమయం దగ్గర పడింది. ఈ సమయంలో మహర్షి స్వామివారితో... "స్వామీ! మీరు ఇంతవరకూ ప్రతి రోజూ నాకు దర్శనమిచ్చారు. నా జీవితం ముగిసి పోయే సమయం ఆసన్న మైంది. నేను ప్రతిక్షణం మిమ్ములను చూస్తూ గడపాలన్నదే నా తపన. అంతే కాకుండా నా అనంతరం కూడా మీరు ఇక్కడే వుండి ఇతర మహర్షులు, ప్రజల పూజలం దుకుంటూ వారిని రక్షిస్తూ వుండండి" అని కోరాడు.పరాశరమహర్షి కోరిన కోరికను మన్నించి స్వామివారు కొండమీద స్వయం వ్యక్తరూపంలో కొలువుదీరినట్లు కథనం. ఈ విధంగా స్వయంభువుగా కొలువుదీరిన స్వామివారికి 'లక్ష్మిదాసి' అనే భక్తురాలు ఆలయం నిర్మింపజేసినట్లు కథనం. స్వామి వారు కొండమిద కొలువు దీరి ఎండ,వానలలో తడుస్తూ వుండేవాడు. పరమ భక్తురాలైన 'లక్ష్మిదాసి'కి ఒకనాడు స్వామివారు స్వప్నం లో సాక్షాత్కరించి ఆలయం నిర్మింపజేసినట్లు కథనం. ఈ విధంగా 'కోరుకొండ' పైన వున్న ఆలయంలో స్వామివారు కొలువుదీరగా, కొండక్రింద వున్న ఆలయంలో స్వామివారు కొలువు దీరడానికి సంబంధించిన గాథ కూడా 'లక్ష్మిదాసి'తోనే ముడిపడి వుంది. కొండపైన ఆలయం నిర్మింపజేసిన లక్ష్మిదాసి అనే భక్తురాలు ప్రతిరోజూ ఉదయమే కొండ నెక్కి స్వామివారిని దర్శించుకుని, పూజలు చేసి కొండదిగి వస్తూ వుండేది. వృద్ధురాలైంది. అయి నా కష్టపడి కొండనెక్కుతూ వుండేది. ఇలా వుండగా ఒకనాడు స్వామివారిని దర్శించేందుకు బయలుదేరిన 'లక్ష్మి దాసి' ఏమాత్రం కొండ ఎక్కలేకపోయింది. కాలు ముందుకు సాగక తీవ్ర దు:ఖానికి లోనైంది. ఇక స్వామివారిని దర్శించి, సేవించే భాగ్యం లేదని బాధ పడింది. ఈ విధంగా లక్ష్మిదాసి బాధపడుతూ వుండగా శ్రీ నరసింహస్వామే మరో రూపంలో కొండ ప్రారంభంలో దర్శనమిచ్చి, లక్ష్మిదాసిని ఓదార్చే వాడట. కొండ ఎక్కలేని లక్ష్మిదాసి కోసం కొండ దిగువనే కొలువుదీరగా, అక్కడ కూడా ఆమె ఆలయం నిర్మింపజేసినట్లు స్థలపురాణం వెల్లడిస్తూ వుంది. కోరుకొండలో భక్తులు ఆహ్లాదకరమైన వాతావరణంలో వున్న రెండు ఆలయాలను దర్శించవచ్చు. కొండమీద ఒక ఆలయం వుండగా దిగువన ఆలయం వుంది. 'మంగళగిరి' క్షేత్రంలో మాదిరే కొండమీద ఆలయం మధ్యాహ్నం వరకు మాత్ర మే తెరచి వుంటుంది. ఈ ఆలయంలో మధ్యాహ్నం వరకు స్వామివారిని మానవులు అర్చిస్తారనీ, మధ్యాహ్నం నుంచీ దేవతలు, ఋషులు పూజిస్తారని చెప్పబడుతూ వుంది. కొంద మీదకు వెళ్ళేందుకు సోపానమార్గం వుంది. సుమారు తొమ్మిది వందలకు పైగా మెట్లు వున్నాయి. ఆలయం ఉత్తరాభి ముఖంగా వుంది. ప్రధాన గర్భాలయంలో స్వామి వారు లక్ష్మిసమేతుడై తొమ్మిది అంగుళాల ఎత్తులో దర్శమిస్తారు. పూర్వం ద్వాపర యుగంలో అరణ్య వాస సమయంలో పాండవులు కొంత కాలం ఈ కొండ సమీపంలో గడిపినట్లు, ఈ స్వామివారిని సేవించినట్లు చెప్పబడుతూ వుంది. ఈ ఆలయం ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే తెరిచి వుంటారు. సోపానమార్గం ప్రారంభంలో శ్రీ ఆంజనేయస్వామి, మధ్యలోని చిన్న ఆలయంలో శ్రీ పద్మనాభస్వామివారిని దర్శించవచ్చు. ఇక కొండ దిగువన గ్రామంలోని ఆలయం తూర్పు అభిముఖంగా వుంది. ఆలయంలోకి ప్రవేశించే ప్రధాన ప్రవేశద్వారం పైన చిన్నగోపురం నిర్మితమైంది. విశాల మైన ప్రాంగ ణంలో మహామండపం, ముఖమండపం, అంత రాలయం, గర్భాలయాలను కలిగి వున్న ఆల యానికి ఎదురుగా బలిపీఠం, ధ్వజస్తంభం, గరుడా ళ్వార్ల మండపాలు వున్నాయి. ప్రధాన గర్భాలయంలో స్వామివారు ఎత్తైన వేదికపైన కొలువు దీరి వున్నారు. వామాంకమున లక్ష్మిదేవిని ఆశీనురాలిని చేసుకుని శంఖు, చక్ర, అభయ ముద్రలను ధరించి స్వామివారు దివ్య మైన అలంకారాలతో దర్శనమిస్తారు. గర్భాల యంలో స్వామివారి ముందు వైపు ఉత్సవమూర్తులను దర్శించుకోవచ్చు. ముఖమండపంలో ఉత్తర, దక్షిణాభిముఖాలుగా వున్న రెండు గర్భాలయాలు వున్నాయి. ఇందులో శ్రీ లక్ష్మిదేవి అమ్మవారు ఒక ఆలయం లోనూ, మరో ఆలయంలో గోదాదేవి కొలువుదీరి పూజలందుకుంటూ వున్నారు. భక్తులు ముందుగా



కొండపైన వున్న ఆలయాన్ని దర్శించి, తర్వాత దిగువన వున్న ఆలయాన్ని దర్శించుకుంటారు. ఏ ఆలయాన్ని దర్శించి కోరికలను కోరినా తప్పక నెరవేరుతాయని భక్తుల విశ్వాసం! చారిత్రకంగా పరిశీలిస్తే 14వ శతాబ్దకాలం నాటి శాసనాలు అనేకం లభించాయి. వీటినిబట్టి ఆలయ చరిత్ర ప్రాశ్యస్త్యం అర్థమవుతూ వుంది. కొండవీటి రెడ్డి రాజులు క్రీ.శ.1325-95ల మధ్య 'కోరుకొండ'ను రాజధానిగా చేసుకుని పరిపాలించారు. అంతకంటే ముందే ఆలయం నిర్మింపబడింది. అయితే అది కేవలం చిన్న ఆలయం కాగా, రెడ్డి రాజుల కాలంలో సుమారు 1353వ సంవత్సరం ప్రాంతంలో లక్ష్మిదాసి అనే భక్తురాలు ఆలయం నిర్మింపజేయగా, రెడ్డిరాజులు దాని అభివృద్ధికి కృషి చేసి, వివిధ నిర్మాణాలు చేసి, ధూపదీప నైవేద్యాలకు అవసరమైన మడిమాన్యాలను ఏర్పాటు చేసినట్లు కథనం. ఆ తర్వాతి కాలంలో వివిధ రాజవంశాలవారు స్వామి వారిని సేవించి తరించారు. 1862వ సంవత్స రంలో ఆలయ జీర్ణోద్ధరణ జరిగినట్లు చరిత్ర చెప్తోంది. ప్రతి రోజూ పూజలు జరిగే ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం ఫాల్గుణ మాసంలో శుక్లపక్ష ఏకాదశి మొదలుకుని ఐదు రోజులపాటూ బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. 'కోరుకొండ'లో భక్తులకు ఎటువంటి వసతి సౌకర్యాలు లభించవు. రాజమండ్రి నుంచి కేవలం20 కిలోమీటర్ల దూరంలో వున్న ఈ క్షేత్రాన్ని రాజమండ్రి నుంచి వెళ్ళి దర్శించుకుని రావడం మంచిది. రాజమండ్రి నుంచి 'కోరుకొండ'కు విరివిగా బస్సు సౌకర్యాలు ఉన్నాయి.